ఆ వివాదంలో హరీశ్‌కు సంబంధం లేదు

- ఇది మాకు, లచ్చిరాజుకు మధ్య ఉన్న వివాదం
- తగాదాలపై ఫాస్మో హాస్పిటాలిటీ సర్వీసెస్ వివరణ

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): ఫాస్మో హాస్పిటాలిటీ సర్వీసెస్, డీ లచ్చిరాజు మధ్య ఉన్న సివిల్ వివాదంలో మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఎలాంటి సంబంధం లేదని, ఆయన ప్రతిష్ఠను దిగజార్చేలా, దురుద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్న వైఖరి మరింత బాధాకరమని ఫాస్మో హాస్పిటాలిటీ సర్వీసెస్ శుక్రవారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లోని మాతృశ్రీనగర్‌లో గల ప్లాట్ నం.89కి జంపాన ప్రభావతి, ప్లాట్ నం.90కి డీ లచ్చిరాజు యాజమానులని సర్వీసెస్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ రెండు ప్లాట్లకు కలిపి 778 చదరపు గజాల భూమికి కలిసి అనుమతులు పొంది, 5వ అంతస్థు వరకు స్లాబ్ కట్టి వదిలేశారని తెలిపారు. ఈ సమయంలో హాస్టల్ కోసం అసంపూర్తి భవనాన్ని వినియోగించుకుంటామని ప్రభావతి, లచ్చిరాజును కోరగా, అందుకు ఒప్పుకున్న ప్రభావతి ప్లాట్‌ను కొనుగోలు చేశామని, కానీ లచ్చిరాజు మాత్రం పదేండ్లు లీజుకు ఇస్తానని, మిగతా నిర్మాణం పూర్తిచేయాలని, అక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చాక లీజు రిజిస్ట్రేషన్ చేస్తానని, నమ్మకం కోసం ఒరిజినల్ డాక్యుమెంట్ ఇచ్చారని తెలిపారు. నిర్మాణం పూర్తయ్యాక ఫాస్మో హాస్పిటాలిటీ సర్వీసెస్ ఏర్పాటుచేశామని, ఆ తర్వాత లచ్చిరాజు లీజు రిజిస్ట్రేషన్ చేయనని, వేరే వారికి విక్రయిస్తానని మాట మార్చినట్టు తెలిపారు. దీంతో ఈ వివాదం గత ఐదేండ్లకు పైగా కొనసాగుతుందని, వివిధ రూపాల్లో వేధింపుల కారణంగా లచ్చిరాజుపై సివిల్ రికవరీ సూట్ వేశామని తెలిపారు. అసలు తమ హాస్టల్‌కు గానీ, సివిల్ దావాలకు గానీ, ఈ వివాదానికి గానీ హరీశ్‌రావుకు ఎలాంటి సంబంధం లేదని, ఇది లచ్చిరాజుకు, తమ నడుమ ఉన్న సివిల్ వివాదం మాత్రమేనని తెలిపారు.

పరువు నష్టం కేసు విచారణ వాయిదా

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం కేసు విచారణ వాయిదా పడింది. ఈ కేసులో వాంగ్మూలం ఇవ్వాల్సిన కేటీఆర్ అనివార్య కారణాల వల్ల శుక్రవారం కోర్టుకు హాజరుకాలేకపోయారని ఆయన తరపు న్యాయవాది తెలిపారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు సమయం ఇవ్వాలని కోర్టును కోరారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేస్తున్నట్టు జడ్జి శ్రీదేవి ప్రకటించారు. ఈ కేసులో సాక్షులుగా బీఆర్ఎస్ నేతలు ఉన్న తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌కుమార్ సాక్షాలను సైతం 23న కోర్టు నమోదు చేయనున్నది. కాగా, సినీ నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువు నష్టం దావాపై సంజాయిషీ చెప్పుకునేందుకు మంత్రి కొండా సురేఖ 23న కోర్టుకు హాజరుకానున్నారు. అదే రోజు ఆమె కేటీఆర్ పిటిషన్‌పై కూడా సంజాయిషీ ఇచ్చే అవకాశం ఉన్నది.

ఆలయ భూములకు జియో ట్యాగింగ్

మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఆలయాలకు చెందిన 34,092 ఎకరాల భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారించామని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇందులో భాగంగా స్టేట్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం విలేకరులతో మంత్రి మాట్లాడారు. ఆలయ భూములను సర్వే చేసి జియోట్యాగింగ్ చేస్తామని చెప్పారు. రాబోయే బ్రహ్మోత్సవాల నాటికి యాదగిరి గుట్ట ఆలయ గోపురాన్ని 60కిలోల బంగారంతో తాపడం చేస్తామని వెల్లడించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భూ సేకరణకు రూ.60 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. దేవాలయాలు, ఏకోటూరిజం ప్రాంతాలను కలుపుతూ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని వివరించారు.

'ఇందిరమ్మ ఇండ్ల'కు సాయం చేయండి

కేంద్రానికి మంత్రి పొంగులేటి విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సాయం చేయాలని రెవెన్యూ, హౌసింగ్‌శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి కులదీప్ నారాయణ్ శుక్రవారం మంత్రి పొంగులేటిని సచివాలయంలో కలిశారు. మంత్రి మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కేంద్రం భావిస్తున్నందున, తెలంగాణ సర్కారుకు సహకరించాలని కోరారు.

క్లారిటీ మిస్సింగ్!

మూసీ ప్రాజెక్టుపై రేవంత్ ప్రభుత్వానికి స్పష్టత కరువు

మొన్న థేమ్స్ మాడల్, మధ్యలో సుందరీకరణ, ఇప్పుడు పునరుజ్జీవమంటూ ప్రకటనలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): మూసీ ప్రాజెక్టుపై రేవంత్ సర్కారుకు స్పష్టత లోపించినట్టు నిపుణులు, ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు. మూసీ ప్రాజెక్టుకు లండన్‌లోని థేమ్స్ మాడల్‌ను అనుసరిస్తామని ఒకసారి, ప్రక్షాళన చేపడుతామని మరోసారి, మూసీ సుందరీకరణ చేపడుతామని ఇంకోసారి, సుందరీకరణ కాదు నదీ పునరుజ్జీవనానికే కట్టుబడి ఉన్నామని మరోసారి సీఎం రేవంత్ పలు విధాలుగా ప్రకటనలు చేయడమే ఉదాహరణగా చెప్తున్నారు. తాజాగా దక్షిణ కొరియాలోని సియోల్‌లో ఉన్న చుంగ్ గై చున్ రీస్టోరేషన్ ప్రాజెక్టును పరిశీలించేందుకు ప్రభుత్వ బృందం సిద్ధమైంది. దీంతో నదులకు సంబంధించిన ప్రాజెక్టులు ఎన్ని రకాలన్న దానిపై చర్చ మొదలైంది.

నదీ ప్రాజెక్టులు-రకాలు

- రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు – నదీ పరీవాహకంలోని గట్టుమీద మొక్కలు, చెట్లు, పార్కులు అభివృద్ధి చేస్తారు. వాటిని విద్యుత్తు దీపాలతో అలంకరించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తారు. ఈ పనులు చేపట్టడానికంటే ముందే నదిలో మురుగు చేరకుండా సీవరేజీ ట్రీట్మెంట్ పూర్తి చేస్తారు.
- రివర్ రీస్టోరేషన్/రీజ్యువెనేషన్ ప్రాజెక్టు – కాలక్రమంలో తన అస్థిత్వాన్ని కోల్పోయిన నదిని తిరిగి మునుపటి విధంగా మార్చేందుకే ఈ ప్రాజెక్టు చేపడుతారు. ఈ విధానంలో గతంలో నది ఎలా ఉండేదో అలాగే మారుస్తారు.
- రివర్ ప్యూరిఫికేషన్ ప్రాజెక్టు– నది సుందరీకరణ కాకుండా కేవలం నదిలోని మురికిని తొలగించడానికి ఈ ప్రాజెక్టును చేపడుతారు. నదీ జలాల్లో మురికి చేరకుండా సీవరేజీ ట్రీట్మెంట్‌ను కూడా ఏర్పాటు చేస్తారు.
- రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు – అడుగంటుతున్న నదీ జలాల్ని పెంచడానికి ప్రధాన నదీ ప్రవాహానికి వాగులను అనుసంధానించి సుందరీకరిస్తారు. నదీజలాల్లో మత్స్య, ఇతర జీవాల సంతతిని పెంచుతారు.
- రివర్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టు – నదీతీరంలోని ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తారు. నదీ జలాల ప్రక్షాళన అనేది ఇందులో ఉండదు.

రేవంత్‌కు ఏమైంది?

- సీఎం ప్రెస్‌మీట్‌పై ప్రభుత్వంలో, పార్టీలో చర్చ
- ఫ్రస్ట్రేషన్, ప్రిపరేషన్ లోపంతో నవ్వులపాలయ్యామని ఆవేదన
- సీఎంకు దొరికిపోవడం అలవాటైందంటూ నెటిజన్ల సెటైర్లు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తరుచూ అడ్డగోలుగా మాట్లాడుతూ.. అడ్డంగా దొరికిపోవడంపై అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో తీవ్ర చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్ పూర్తిగా గాడితప్పిందని అభిప్రాయపడుతున్నారు. అసలు రేవంత్‌రెడ్డికి ఏమయ్యింది? అన్న చర్చ జరుగుతున్నది. 'దశాబ్దకాలం తర్వాత కూడా ఈ ప్రెస్‌మీట్ గురించి చెప్పుకుంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న సమావేశం ఇది' అంటూ సీఎం మాట్లా డే ముందు వ్యాఖ్యాత గొప్పగా చెప్పుకొచ్చా రు. కన్సార్షియం ప్రతినిధులు కూడా సమావేశానికి హాజరుకావడంతో మూసీ ప్రాజెక్టుపై అనుమానాలన్నీ నివృత్తి చేస్తారని, ప్రభుత్వ విజన్‌ను ఆవిష్కరిస్తారని అటు పార్టీ వర్గాలు, ఇటు ప్రభుత్వ వర్గాలు అంచనా వేశాయి. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం నీరసంగా మొదలు పెట్టడం, 'మీరు కాదంటే ప్రాజెక్టు ఆపేస్తా' అంటూ పదేపదే మీడియా ప్రతినిధులపైకి నెట్టడంతో అందరూ కంగుతిన్నారు. ఆ తర్వాత ప్రసంగంలో మూసీ పుట్టుక, పేరు మొదలు ప్రతి అంశంలోనూ అవగాహన లేమి తో మాట్లాడినట్టు కనిపించడంతో పూర్తిగా నీరుగారిపోయారు. ముఖ్యంగా లక్షన్నర కోట్లు ఎవరన్నారు?, మూసీ సుందరీకరణ అని ఎవ రు చెప్పారు? అంటూ సీఎం వేసిన ప్రశ్నలు బూమరాంగ్ అయ్యి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ అయిన సంగతి తెలిసిందే. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కూడా సీఎంకు గుర్తుకు లేకపోవడం ఏమిటన్న ప్రశ్నలు కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రిపరేషన్ లేకుండా ఒక ముఖ్యమంత్రి ఎలా మాట్లాడుతారని కాంగ్రెస్ నేతలే ప్రశ్నిస్తున్నా రు. సీఎం ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని, ఇలాంటి సమయంలో జాగ్రత్తగా మాట్లాడాల్సింది పో యి, ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ను గుడ్డిగా నమ్మడం ఏమిటని చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో సమతామూర్తిని నిర్మించిన విషయాన్ని కూడా క్రాస్ చెక్ చేసుకునే వ్యవస్థ సీఎంవోలో గానీ, సీఎం పీఆర్వోల్లో గానీ లేకపోవడం ఏమిటని మండిపడుతున్నారు. చుట్టూ ఉన్నవాళ్లే సీఎంను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్‌పై సోషల్ మీడియాలో రెండో రోజూ ట్రోలింగ్ నడిచింది. ఆయన పాత, కొత్త వీడియోలను జత చేసి 'ఆయనకు ఆయనే కౌంటర్ ఇచ్చుకున్నారు' అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అడ్డంగా దొరికిపోయిన సందర్భాల వీడియో క్లిప్పింగ్‌లు జోడిస్తూ వైరల్ చేస్తున్నారు.

మూసీపై మీరెందుకు మాట్లాడరు?

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : మూసీ ప్రాజెక్ట్ రాష్ట్ర మంత్రివర్గంలో కొత్తమంట పెట్టినట్టు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్ విఫలం కావడం, మరింత వ్యతిరేకత మూటగట్టుకోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి మరింత ఫ్రస్ట్రేషన్‌కు గురైనట్టు సచివాలయ వర్గాల్లో వినిపిస్తున్నది. అందుకే శుక్రవారం పెద్దగా కార్యక్రమాల్లో పాల్గొనలేదని తెలుస్తున్నది. 'మూసీపై నేనొక్కడినే మాట్లాడాలా?.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు?' అంటూ అసహనం వ్యక్తం చేసినట్టు చెప్పుకుంటున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ మూసీ అంశంలో ప్రభుత్వంపై దాడి చేస్తుంటే ఎదురుదాడి ఎందుకు చేయడం లేదని రుసరుసలాడినట్టు సమాచారం. ఇకపై మంత్రులు, ఎంపీలు, నేతలు ఎదురుదాడికి దిగాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. శుక్రవారం మంత్రులు దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టారని పేర్కొంటున్నారు. కాగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రెస్‌మీట్ శనివారానికి వాయిదాపడింది. కాగా, ఎదురుదాడి చేయాలన్న ఆదేశాలపై కొందరు మంత్రులు సన్నిహితుల దగ్గర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చర్చ జరుగుతున్నది. మూసీ ప్రాజెక్టును మొదటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి తన ఖాతాలో వేసుకున్నారని, ఇప్పుడు వ్యతిరేకత వచ్చాక తాము గుర్తుకొచ్చామా? అని గుర్రుగా ఉన్నట్టు తెలిసింది.

ఇండ్లు కోల్పోయిన మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సీతక్క

మూసీ బాధితులకు సబ్సిడీ రుణాలు!

- ఇండ్లు కోల్పోయినవారికి 2 లక్షలు పంపిణీ
- 172 మందికి చెక్కులు అందజేసిన సీతక్క
- ఈ పథకం మూసీ బాధితులకా? రాష్ట్రం మొత్తానికా?
- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని పావలా వడ్డీ రుణాల కోసం స్వయం సహాయక మహిళా సంఘాల ఎదురుచూపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఇండ్లు కోల్పోయిన బాధిత మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, ఇందులోభాగంగా ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రుణం అందజేస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఇల్లు కోల్పోయి, డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి మారిన వారికి ఆర్థిక చేయూతనివ్వడంలో భాగంగా 172 మంది లబ్ధిదారులకు రూ.3.44 కోట్ల చెక్కులను మంత్రి సీతక్క శుక్రవారం ప్రజాభవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక్కో మహిళకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, ఇందులో రూ.1.4 లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ.60 వేలను మూడు ఏండ్లలో లబ్ధిదారులు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. డబుల్ బెడ్‌రూంలు పొందిన బాధిత కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశం కల్పించామని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనలో జీహెచ్ ఎంసీ పాత్ర చాలా కీలకమని అన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సీఈవో దివ్యరాజ్, మూసీ జేడీఎం గౌతమి, మూసీ ఈడీ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య భట్టు, డీఈవో రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఈ పథకం అందరికీ వర్తిస్తుందా?

స్వయం సహాయక బృందాలకు పావలా వడ్డీతో రుణాలు అందజేస్తామని, మహిళా పారిశ్రామికవేత్తల కోసం నైపుణ్య శిక్షణా కేంద్రాలతోపాటు ప్రత్యేక నిధి ఏర్పాటుచేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా పావలా వడ్డీ రుణాల అమలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయలేదని స్వయం సహాయక బృందాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. తమకు రుణాలు ఎప్పుడిస్తారు? అంటూ కొందరు స్వయం సహాయక సంఘాల మహిళలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూసీ బాధితులకు రూ.2 లక్షల చొప్పున సబ్సిడీ రుణాలు అందజేయడం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతానికి ఈ పథకాన్ని మూసీ బాధిత మహిళలకు మాత్రమే వర్తింపజేస్తారా? రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపచేస్తారా? అనే విషయంలో స్పష్టత లేదు.

పునర్విభజన హామీలను నెరవేర్చండి

కేంద్రమంత్రికి ఎంపీ వద్దిరాజు వినతి

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఏపీ పునర్విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిశారు. హామీలలో ప్రధానమైన ఐఐఎంను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో అనేక విప్లవాత్మక చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా జిల్లాకో మెడికల్, నర్సింగ్ కాలేజీ ఏర్పాటుచేయటమే కాకుండా గురుకులాలను మూడింతలకు పెంచిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సర్కార్ జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు కేంద్రానికి నివేదించిందని, ఇప్పటికైనా నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కేంద్ర మంత్రి ప్రధాన్ సానుకూలత వ్యక్తంచేశారు.

గాంధీభవన్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రూప్-4 అభ్యర్థులు

గ్రూప్-4 అభ్యర్థుల గాంధీభవన్ ముట్టడి

- అన్‌విల్లింగ్ ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్
- ఆఫీస్ ఆవరణలో నినాదాల హోరు
- మెట్లపై కూర్చొని ప్లకార్డుల ప్రదర్శన

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 18: గ్రూప్-4 తుది ఫలితాలు ఇవ్వక ముందే అన్‌విల్లింగ్ ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పలువురు అభ్యర్థులు హైదరాబాద్ గాంధీభవన్‌ను ముట్టడించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన అభ్యర్థులు మెట్లపై కూర్చొని నినదించారు. బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకొని నిరసన ప్రదర్శన నిర్వహించారు. బ్యాక్‌లాగ్ హటావో-గ్రూప్-4 బచావో, బ్యాక్‌లాగ్ తీసేయండి-గ్రూప్-4ను రక్షించండి.. అన్ని నినాదాలు మిన్నంటాయి. ఇతర ఉద్యోగాలకు ఎంపికైన వారు అన్‌విల్లింగ్ ఆప్షన్ పెట్టుకుంటే ఆ తర్వాత ఉన్న వారికి అవకాశం దక్కుతుందని తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టులను మిగిల్చవద్దని డిమాండ్ చేశారు. 1:3 ప్రకారం ఎంపికైన గ్రూప్-4 జాబితాలోని ఎందరో అభ్యర్థులు ఎన్నో పోటీ పరీక్షల్లో పైస్థాయి ఉద్యోగాలు సాధించారని, ఇలాంటి వారు సుమారు 2,000కు మించి ఉంటారని తెలిపారు. తుది ఫలితాలు ఇవ్వకముందే వారి నుంచి అన్‌విల్లింగ్ ఆప్షన్ తీసుకోవాలని కోరారు. ఏండ్లుగా కష్టపడుతున్న తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ప్రక్రియను పూర్తిచేసి వెంటనే గ్రూప్-4 తుది ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి సమస్యలు తెలుపుతున్న గ్రూప్-4 అభ్యర్థులు

జీవో-29పై ప్రభుత్వం దిగిరావాలి

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో గ్రూప్-1 అభ్యర్థులు

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తేతెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో పాటిస్తున్న జీవో-29ని రద్దుచేయాలని అభ్యర్థులు డిమాండ్ చేశా రు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. జీవో-29 గ్రూప్-1 అభ్యర్థుల పాలిటశాపంగా మారిందని, జీవో-55ను అమలుచేయాలని తాము కోరినా సీఎం రేవంత్‌రెడ్డి పెడచెవినపెట్టారని వాపోయారు. హైడ్రా గురించి మాట్లాడుతున్న సీఎం.. జీవో -29 వల్ల నష్టపోతున్న విద్యార్థుల వైపు ఎందుకు నిలబడటం లేదని ప్రశ్నించారు. కోర్టు తీర్పు వచ్చేవరకు గ్రూప్ -1 మెయిన్స్‌ను రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ 2.0 ఉద్యమాన్ని మళ్లీ చూడాల్సివస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడాలని ఒకవైపు రాహుల్‌గాంధీ చెప్తుంటే, రేవంత్ సర్కారు రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతుందని మండిపడ్డారు.

బీసీ కమిషన్ జిల్లా పర్యటనలు ఖరారు

రిజర్వేషన్ల ఖరారుపై అభ్యంతరాలు, సలహాల స్వీకరణ

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల విషయంలో ప్రజా, కుల సంఘాల ప్రతినిధుల నుంచి అభ్యర్థనలు, సూచనలు, అభ్యంతరాల స్వీకరణ కోసం బీసీ కమిషన్ పర్యటనపై శుక్రవారం నోటిఫికేషన్ విడుదలైంది. 28న ఆదిలాబాద్, 29న నిజామాబాద్, 30న సంగారెడ్డి, నవంబర్ 1న కరీంనగర్, 2న వరంగల్, 4న నల్లగొండ, 5న ఖమ్మం, 7న రంగారెడ్డి, 8న మహబూబ్‌నగర్, 11న హైదరాబాద్ కలెక్టరేట్లలో బహిరంగ విచారణను బీసీ కమిషన్ చేపట్టనుంది. నవంబర్ 11న ప్రత్యేకంగా ఎన్‌జీవోలు, సంస్థలు, కుల,సంక్షేమ సంఘాల కోసం, 13న సాధారణ ప్రజల కోసం బహిరంగ విచారణను నిర్వహించనునట్టు వెల్లడించింది. నవంబర్ 13 వరకు వ్యక్తిగతంగా లేదంటే పోస్ట్ ద్వారా, కమిషన్ కార్యాలయంలో అభ్యర్థనలు ప్రత్యేకాధికారికి సమర్పించవచ్చని స్పష్టం చేసింది. పూర్తి వివరాల www.telangana.gov.in పోర్టల్‌ను సంప్రదించాలని సూచించింది.

సుప్రీంకోర్టుకు గ్రూప్-1 అభ్యర్థులు

- పరీక్షలు వాయిదా వేయాలని పిటిషన్
- జీవో-29ను రద్దుచేయాలని వినతి

హైదరాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పరీక్షలపై న్యాయపోరాటం చేస్తున్న అభ్యర్థులు శుక్రవారం దేశ సర్వోన్నత న్యాయస్థానం తలుపుతట్టారు. హైకోర్టులో పోరాడిన అభ్యర్థులు ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్లారు. పరీక్షలను వాయిదా వేయాలని, జీవో-29ని రద్దు చేయాలని కోరుతూ పోగుల రాంబాబు, ఇతర అభ్యర్థులు పిటిషన్ దాఖలుచేశారు. గ్రూప్-1 పరీక్షల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించలేదని, ఈ నెల 21 నుంచి జరగాల్సిన గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థుల తరపు అడ్వకేట్ మోహిత్‌రావు ఆ పిటిషన్‌లో కోరారు. తమ పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ జరపాలని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు మోహిత్‌రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ కేసును తక్షణమే విచారించలేమని, సోమవారం విచారణ చేపడతామని చీఫ్ జస్టిస్ వెల్లడించారు. అనంతరం గ్రూప్-1 అభ్యర్థులు ఇక్కడి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, సుప్రీం కోర్టు సోమవారం విచారణ చేపట్టి.. ఉత్తర్వులు జారీ చేసే వరకు గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

అప్పీళ్లను కొట్టివేసిన హైకోర్టు ధర్మాసనం

గ్రూప్-1 పరీక్షల నోటిఫికేషన్ జారీని, మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలన్న అభ్యర్థనను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశంపై ఈ నెల 15న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుల్లో జోక్యం చేసుకోవడానికి ఆస్కారం లేదని చెప్పింది. ప్రిలిమినరీ పరీక్ష కీలో తప్పుల్నుందున పరీక్షను రద్దు చేసి తాజాగా నిర్వహించేలా ఆదేశించాలన్న అప్పీళ్లను కొట్టివేస్తున్నట్టు తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణతో కూడిన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. మెయిన్స్ పరీక్షల నిర్వహణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

జీవో-29 సారాంశం ఇదే..

టీజీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో భాగంగా ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికకోసం కులాలతో సంబంధం లేకుండా మెరిట్ ప్రకారం 1:50 నిష్పత్తిలో ఎంపికచేస్తారు. మల్టీజోన్ వారీగా మొత్తం ఖాళీల నుంచి 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపికచేస్తారు. ఇది పూర్తిగా మెరిట్ ఆధారంగా జరుగుతుంది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత రిజర్వ్ క్యాటగిరీలో షార్ట్‌ఫాల్ (లోటు) ఏర్పడితే, రూల్స్ 22, 22ఏలో నిర్దేశించిన ప్రకారం ఆయా లోటును పూడ్చేందుకు సంబంధిత వర్గాల మెరిట్ జాబితా నుంచి మరికొంత మంది అభ్యర్థులను ఎంపికచేస్తారు. ఇలా ఒక్కోసారి 1:50 రేషియో దాటినా అనుమతిస్తారు. ఇది వరకు జీవో-55 ప్రకారం జనరల్ మెరిట్‌తో సంబంధం లేకుండా కులాల వారీగా ఎన్ని పోస్టులు రిజర్వ్ అయ్యాయో అంతేస్థాయిలో 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసేవారు.

ఆర్థిక ఇబ్బందులు.. హోంగార్డుల ఆత్మహత్యలు

- ఈ ఏడాది 20 మంది మృతి
- అరకొర జీతాలతో ఆర్థిక కష్టాలు
- ఎన్నికల హామీని మరిచిన కాంగ్రెస్ సర్కార్
- ఆందోళనలో 16 వేల కుటుంబాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): హోంగార్డులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అరకొర వేతనాలు కూడా సకాలంలో రాక అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వచ్చే అరకొర జీతంలో సగం బందోబస్తులు, పెట్రోల్, ఇతర అవసరాలకే సరిపోతున్నదని హోంగార్డుల